# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 04-02-2026 సమయం : సాయంకాలం 6గం. 10ని.లు

## ముఖ్యాంశాలు

- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ సంక్షేమ శాఖపై ఈరోజు సమీక్ష చేపట్టారు.
- క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రజలు అందరూ అవగాహన పెంచుకోవాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ కోరారు.
- 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్ కూర్పుపై మంత్రులు కె. అచ్చెన్నాయుడు, అనితలతో ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశమయ్యారు.
- అండర్-19 వన్డే ప్రపంచ కప్ లో భాగంగా హరారె వేదికగా జరుగుతున్న సెమీఫైనల్ మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్.. భారత్ కు 311 పరుగుల లక్ష్యాన్ని నిర్ధేశించింది.

====================

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీ సంక్షేమ శాఖపై రాష్ట్ర సచివాలయంలో ఈరోజు సమీక్ష చేపట్టారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణంతో పాటు సురక్షిత తాగునీటి కోసం ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేసే అంశంపై సమీక్షకు హాజరైన బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత, ఆ శాఖ ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం చేశారు. 60 కోట్ల రూపాయల సాస్కి నిధులతో రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. 814 హాస్టళ్లలో 17 కోట్ల రూపాయల వ్యయంతో మార్చిలోగా ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రికి అధికారులు తెలియజేశారు. వసతి గృహాల్లో పరిశుభ్రత, ఆహార పదార్థాల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఆరోగ్య సంరక్షణ, విద్యా భోదనల్లో ఉత్తమ పద్దతులను అనుసరించాలని ముఖ్యమంత్రి సూచించారు.

====================

క్యాన్సర్ వ్యాధిపట్ల ప్రజలు అందరూ అవగాహన పెంచుకోవాలని, ముందస్తు నిర్ధారణకు ప్రభుత్వం నిర్వహిస్తున్న క్యాన్సర్ పరీక్షలను సద్వినియోం చేసుకోవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి వై. సత్యకుమార్ యాదవ్ కోరారు. ప్రపంచ క్యాన్సర్ నివారణ దినాన్ని పురస్కరించుకుని గుంటూరులోని ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడ్ ఫ్యూజన్ ను మంత్రి ఈరోజు సందర్శించారు. క్యాన్సర్ నివారణకు ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఆయన పరిశీలించారు. క్యాన్సర్ గుర్తింపు, నిర్ధారణ ప్రక్రియల గురించి ఆంకాలజీ విభాగం విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన పాత్రికేయులతో

మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా అత్యాధునిక పరికరాలతో క్యాన్సర్ ఆసుపత్రులను నిర్మిస్తున్నామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలలో మహిళలు ఇంకా పెద్ద సంఖ్యలో క్యాన్సర్ పరీక్షలకు ముందుకు రావాలని ఈ సందర్భంగా మంత్రి విజ్ఞప్తి చేస్తూ...

(వాయిస్ 36 సెకన్లు)

====================

రానున్న అసెంబ్లీ సమావేశాల్లో 2026–27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వార్షిక బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో.. ముందస్తుగా బడ్జెట్ కూర్పుపై ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్... హోం మంత్రి వంగలపూడి అనిత, పోలీస్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణను మరింత పటిష్టంగా నిర్వహించేందుకు హోం శాఖకు అవసరమైన నిధుల కేటాయింపులపై సుదీర్ఘంగా చర్చించారు. పోలీస్ శాఖ మౌలిక వసతుల అభివృద్ధి, ఆధునిక సాంకేతిక పరికరాల వినియోగం, సిబ్బంది అవసరాలు తదితర అంశాలపై అధికారులు మంత్రులకు వివరించారు. రాష్ట్ర భద్రతకు ప్రాధాన్యతనిస్తూ.. బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని మంత్రులు ఈ సందర్భంగా తెలియజేశారు.

అనంతరం రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కే అచ్చెన్నాయుడుతో మంత్రి పయ్యావుల కేశవ్ సమావేశమయ్యారు. రైతుల ఆదాయం పెంపు, వ్యవసాయ ఉత్పాదకత వృద్ధి, ఆధునిక సాంకేతికత అమలు, పశుసంవర్ధక రంగ విస్తరణ వంటి అంశాలకు బడ్జెట్‌లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పించాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు.

====================

జేఈఈ మెయిన్స్ 2026 (సెషన్-1) ప్రొవిజినల్ ఆన్సర్ కీ విడుదలైంది. జనవరి 21 నుంచి 29వ తేదీ వరకు ఈ మెయిన్స్ పరీక్షలు నిర్వహించగా.. పేపర్ -1కు సంబంధించిన ప్రొవిజినల్ ఆన్సర్ కీ, రెస్పాన్స్ షీట్లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) ఈ రోజు విడుదల చేసింది. అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్, క్యాప్చా కోడ్ ఎంటర్ చేసి ప్రాథమిక కీ, రెస్పాన్స్ షీట్‌లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపింది. ఈ ఆన్సర్ కీపై అభ్యంతరాలను ఈరోజు నుంచి ఫిబ్రవరి 6 వరకు తెలయజేవయచ్చని, అభ్యంతరాల స్వీకరణ గడువు ముగిసిన అనంతరం తుది కీ విడుదల చేసి ఫిబ్రవరి 12న ఫలితాలు ప్రకటించనున్నారు.

విరామం

====================

ప్రతి నీటి బొట్టునూ ఒడిసి పట్టుకుని, భూమిని కూడా రిజర్వాయర్ లా మార్చుకొనే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. అమరావతిలో మంత్రి పాత్రికేయులతో ఈరోజు మాట్లాడుతూ... జలవనరుల శాఖ ఆధ్వర్యంలో రేపు అమరావతిలో సాగునీటి సంఘాల అధ్యక్షులతో సమావేశం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. ఈ సమావేశానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ హాజరుకానున్నారని చెప్పారు. జలవనరుల శాఖను గాడిలో పెడుతూ.. పోలవరం, హంద్రీనీవా, వెలిగొండ, గాలేరునగరి, పోలవరం ఎడమ ప్రధాన కాలువ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులపై దృష్టి సారిస్తున్నామని మంత్రి ఈ సందర్భంగా వివరిస్తూ..

(వాయిస్ 26 సెకన్లు)

====================

ఆన్ బ్రాండెడ్ ముడి పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాన్ని సున్నా శాతానికి తగ్గిస్తూ.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన గెజిట్ నిర్ణయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వాగతిస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. ఈ నిర్ణయం రాష్ట్రంలోని పొగాకు రైతులు, చిరు వ్యాపారులకు ప్రత్యక్షంగా లాభం చేకూరుస్తుందని పేర్కొన్నారు. గతంలో అస్పష్టమైన నిబంధనల వల్ల రైతులు, వ్యాపారులు ఎదుర్కొన్న ఇబ్బందులు ఈ గెజిట్‌తో తొలగిపోతాయని చెప్పారు.

అయితే బ్రాండెడ్‌గా ప్యాక్ చేసిన పొగాకు ఉత్పత్తులపై 18 శాతం ఎక్సైజ్ సుంకం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో పన్నుల విషయంలో స్పష్టత, పారదర్శకత పెరుగుతాయని, రైతులకు మెరుగైన ధర లభించే అవకాశం ఉందని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

====================

అంతర్జాతీయ నౌకాదళ సమీక్ష (IFR-2026), మిలాన్, అంతర్జాతీయ సిటీ పరేడ్ కార్యక్రమాల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఇండియన్ నేవీ, పోలీసు, ఇతర విభాగాల అధికారులతో కలెక్టరేట్ మీటింగ్ హాలులో ఆయన ఈరోజు సమీక్షా సమావేశం నిర్వహించారు. కోస్ట్ గార్డు డీఐజీ రాజేష్ మిత్తల్, పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ, వీఎంఆర్డీఏ కమీషనర్ తేజ్ భరత్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, డీసీపీలు, ఆర్డీవోలు, ఇతర అధికారులు భాగస్వామ్యమై వివిధ అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... భారత రాష్ట్రపతి, రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, రాష్ట్ర గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు రానున్న నేపథ్యంలో భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, మౌలిక వసతుల కల్పన, వైద్య సేవలు అత్యంత సమర్థవంతంగా ఉండాలని అధికారులకు స్పష్టం చేశారు. ఫిబ్రవరి 17న రాష్ట్రపతి రాకతో కార్యక్రమాలు మొదలవుతాయని, 18న నౌకాదళ ఫ్లీట్ రివ్యూ, 19న ఉదయం మిలాన్ ప్రారంభోత్సవం, సాయంత్రం ఆర్కే బీచ్ రోడ్డులో అంతర్జాతీయ సిటీ పరేడ్ ఉంటుందని, కార్యక్రమాలను వీక్షించేందుకు రెండు నుంచి మూడు లక్షల మంది హాజరయ్యే అవకాశం ఉన్నందున సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు.

====================

విశాఖపట్టణంలోని సింహగిరిపై కొలువుదీరిన శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి వారి దేవస్థానం నూతన కార్యనిర్వాహణాధికారిగా కె. వెంకట్రావు నియమితులయ్యారు. రెవెన్యూ శాఖకు చెందిన స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ కె. వెంకట్రావును ఆలయ నూతన ఈవోగా నియమిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఈయన కాకినాడ జిల్లా రెవెన్యూ అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. వెంకట్రావు ఏడాది కాలం పాటు సింహాచలం దేవస్థానంలో ఈఓ బాధ్యతలు నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

====================

అండర్-19 వన్డే ప్రపంచ కప్ లో భాగంగా భారత్, అఫ్గానిస్థాన్ జట్ల మధ్య జింబాబ్వే లోని హరారె స్టేడియం వేదికగా 2వ సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగుతోంది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న అఫ్గానిస్థాన్.. భారత్‌కు 311 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. అఫ్గానిస్థాన్ బ్యాట్స్‌మెన్లలో ఫైజల్ షినోజాదా 110, ఉజైరుల్లా 101 పరుగులతో రాణించారు. లక్ష్య ఛేధన ప్రారంభించిన భారత్ 11 ఓవర్లు పూర్తయ్యే సరికి ఒక వికెట్ నష్టపోయి 105 పరుగులు చేసింది.

====================

====================